ఉచిత వైద్య శిబిరం విజయవంతం

బంజారాహిల్స్,జనవరి 27: బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సీనియర్ సిటిజన్స్ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులకు బీపీ, షుగర్‌తో పాటు ఇతర పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ విజయకుమారి, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, బెజవాడ సుబ్బలక్ష్మి, కళావతి నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయండి

బండ్లగూడ,జనవరి 27: చెత్తను తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో వారికి అందజేయాలని అధికారులు ఎన్ని సార్లు అవగాహన కల్పించిన ఫలితం లేకుండా పోతుంది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొంత మంది నివాసితులు తమ ఇండ్లలోని చెత్తను ఆరుబయట వేస్తున్నారు. ఇది గమనించిన పారిశుధ్య కార్మికుడు నరేందర్ వారిని వారించడంతో పాటు చెత్తను పారేసుందుకు తెచ్చిన చెత్తను తిప్పి వారి తోనే పంపించాడు. అతడిని పట్టుకుని ఐదు వందల రూపాయాల ఫైన్‌కూడా విధించారు. ప్రజలు తమ ఇంట్లోని చెత్తను చెత్త సేకరణ కోసం వచ్చే ఆటో వారికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద, కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

వెంగళరావునగర్,జనవరి 27: మహిళలు సంపూర్ణంగా అభివృద్ధి సాధించాలంటే భారత రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాల పై సమగ్ర అవగాహన అవసరమని హైకోర్టు న్యాయమూర్తి సూరపల్లి నంద సూచించారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో శ్రీ సత్యసాయి ఆర్గనైజేషన్స్ హైదరాబాద్ శాఖ అధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థినుల కోసం ఎవేకింగ్ ద యూత్ వితిన్ పేరిట ప్రత్యేక వర్క్ షాప్ నిర్వహించారు. సత్య సాయి సేవా సంస్థల హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు మల్లేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా సూరపల్లి నంద, ఐఏఎస్ అధికారిని ఉదయలక్ష్మి, సత్య సాయి ఇనిస్టిట్యూషన్స్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ స్టేట్ ఇన్‌చార్జి మాధవి లత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాశంలో సగం అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని చెబుతున్నప్పటికీ ఇంకా వివక్ష కొనసాగుతుందన్నారు. సొంత కుటుంబం నుంచి వివక్షకు గురవుతున్న మహిళలు పనిచేసే చోటా మరింత ఇబ్బందులుకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మహిళా తన హక్కులు బాధ్యతలను తెలుసుకోవడం ద్వారా అవకాశాలను చేజిక్కించుకోవడంతో పాటు సమాచానికి ఆదర్శంగా నిలవవచ్చునని అన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత ఆశయాలను నిర్ధేశించుకుని వాటి సహకారం కోసం ఇష్టంగా శ్రమించాలని సూచించారు. గొప్పగా అభివృద్ధి సాధించిన వారంతా గొప్ప గొప్ప కుటుంబాలలో జన్మించిన వారు కాదన్న విషయం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నగరంలోని ఎనిమిది కళాశాల డిగ్రీ విద్యార్థినులు సుమారు 1600 మంది హాజరయ్యారు.

ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఉపరాష్ట్రపతి

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మణికొండ, జనవరి 27: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో సకుటుంబ ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. కాలనీలోని ముహుర్తం బంకెట్ హాల్‌లో స్వర్ణోత్సవ సకుటుంబ ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 50 వసంతాల స్నేహబంధం ఒక జీవితకాల భావోద్వేగాలు, ఆలింగనాలు, ఆప్యాయతలు, సమతుల్లే ప్రేమానురాగాల మధ్య విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను తలచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు మణికొండ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు దూళిపాల సీతారాం, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బీరప్ప, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, కౌన్సిలర్ వందన, శ్వేత, కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనితాదేవి, నాయకులు నర్సయ్యాచారి, రవికాంత్‌రెడ్డి, ఆనంద్ రావు, శివరాంరెడ్డి, రంగబాబు, ప్రభాకర్ రెడ్డి, వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సొంతడబ్బులతో సీసీరోడ్డు పనులు ప్రారంభం

చిన్నగోల్కొండలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మావతి అనంతరెడ్డి

శంషాబాద్ రూరల్, జనవరి 26 : తన సొంత డబ్బులతో గ్రామంలో సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్లు చిన్నగోల్కొండ గ్రామ సర్పంచ్ గుర్రం పద్మావతి అనంతరెడ్డి తెలిపారు. శనివారం శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలో సర్పంచ్ గుర్రం పద్మావతి అనంతరెడ్డి దంపతులు రూ.20 లక్షలతో చిన్నగోల్కొండలో రూ.10 లక్షలు, అనుబంధ సంఘీగూడలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభించిన్నట్లు తెలిపారు. ఐదేండ్ల నుంచి తన సొంత డబ్బులతో దేవాలయాల నిర్మాణంతో పాటు సీసీరోడ్లు తదితర వాటిని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశానని వివరించారు. ఈ నెల 8న రూ. 30 లక్షలతో సీసీరోడ్డు పనులను పూర్తి చేశామని తెలిపారు. చిన్నగోల్కొండలో ఇప్పటికే సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భిక్షపతియాదవ్,వార్డు సభ్యులు గౌతమ్‌బాబు, మాధురి, లక్ష్మీ, రాఘవేందర్, మల్లేశ్, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

హిమాయత్‌నగర్‌లో నూతన కమిటీని సత్కరిస్తున్న రాపోలు సుదర్శన్

హిమాయత్‌నగర్,జనవరి27: ప్రజా భాష,ప్రగతిశీలత, సామాజిక దృష్టి ప్రసరించిన ప్రజా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అర సం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ అన్నారు. శనివారం హిమాయత్ నగర్ లోని అమృత ఎస్టేట్స్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో నగర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి, దారిద్ర్యం,సాంఘిక వెనుకబాటు వంటి సమస్యలపై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అరసం నగర నూతన కమిటీని ఎన్ను కున్నారు. నగర అధ్యక్షుడిగా సూర్య ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా రామ్మోహన్ రెడ్డి ,వి.వి.చారి, కుమార్ దోసల, సరోజ బాల ఠాకూర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్ గౌడ్, సహాయ కార్యదర్శు లుగా డాక్టర్ విజయ భాస్కర్, వెంకటేశ్వర్లు, శివకుమార్,డి.కె.నాయక్, కోశాధికారిగా అటుకుల రాజు,కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ వేముల నారాయణ,ఛత్రపతి శివాజీ,కిషన్, ఎన్.ఆర్. శ్రీనివాస్, సృజన్ కుమార్,మాధవి,నాగరాజును ఎన్నుకున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బండ్లగూడ,జనవరి 27: కాలనీలలో తాగు నీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మాలతి నాగరాజు జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలోని సాయి బాలాజీ నగర్, ఇండస్‌వ్యాలీ, వెస్టన్ కాలనీ, చంద్రయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే స్పందించి ఆయా కాలనీల్లో తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27: శివరాంపల్లి రైల్వేస్టేషన్‌లో మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... శివరాంపల్లి రైల్వేస్టేషన్‌లో ఉదయం ప్రయాణికులు స్టేషన్‌లోకి వెళ్లగా అక్కడ ఒక మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించింది. వెంటనే వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఆ మహిళ వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

వెంగళరావునగర్, జనవరి 27:ఆటోలో నలుగురు యువతులతో కలిసి ఇద్దరు యువకులు ప్రయాణిస్తుండటాన్ని పోకిరీలు గమనించారు. ఆటోను మధురానగర్ సమీపంలోని సిద్ధార్థ నగర్ పార్క్ వద్ద అడ్డుకుని..ఆటోలోని యువకుడితో అకారణంగా గొడవ పెట్టుకున్నారు. ఆటో లోంచి యువకుడిని బయటకు లాగి దాడి చేశారు. తన బాయ్ ఫ్రెండ్ ను పోకిరీలు కొడుతుండటంతో ఓ యువతి వారి పై తిరగబడింది. రహ్మత్ నగర్ కు చెందిన యువకుడిపై ఫిలింనగర్ బస్తీ పోకిరీలు దాడికి దిగారని తెలుసుకుని ఇరు బస్తీల యువకులు గుమిగూడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇంతలో గస్తీ నిర్వహించే పోలీసులు రావడాన్ని గమనించి వారు పరుగులు తీశారు. అయితే ఈ గొడవకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని మధురానగర్ పోలీసులు తెలిపారు.

వెంకయ్యనాయుడును సత్కరించిన ఆకృతి సంస్థ

బంజారాహిల్స్,జనవరి 27: పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆకృతి సాంస్కృతిక సంస్థ శనివారం ఘనంగా సత్కరించింది. సంస్థ నిర్వాహకుడు ఆకృతి సుధాకర్, వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు, ఆకృతి కార్యదర్శి మహేందర్ జూబ్లీహిల్స్‌లోని వెంకయ్యనాయుడు నివాసానికి వెళ్లి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వెంకయ్యనాయుడుకు శుభాకాంక్షలు

బంజారాహిల్స్: అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌ను అందుకున్న భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుని ఫిల్మ్‌నగర్ కల్చరల్ క్లబ్ కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలుసుకున్నది. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేషగిరి రావు, ఉపాధ్యక్షుడు రంగారావు, కార్యదర్శి ముళ్లపూడి మోహన్, సహాయ కార్యదర్శి వీఎస్ఎస్ పెద్దిరాజు, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి బృందం వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత విద్యామండలిని ప్రక్షాళన చేయండి

ఖైరతాబాద్: రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలిని ప్రక్షాళనే చేయాలని గిరిజన శక్తి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు శరత్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షలాది రూపాయలు అడ్మిషన్ల కోసం తీసుకుంటున్నారని, మరో వైపు ప్రభుత్వ విద్య ప్రశ్నార్థకంగా మారిందన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

హిమాయత్‌నగర్,జనవరి27: రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటిని చూపిస్తూ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం, నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకు తగిన ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో నిరుద్యోగ సమస్య మరింత జఠిలమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ దశలో నిలిచిపోయిన ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు కొత్త ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీకాంత్,రాష్ట్ర ఉపాధ్య క్షుడు శ్రీమాన్,నాయకుడు షబ్బీర్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు ఏర్పాట్లు పూర్తి

శంషాబాద్ రూరల్, జనవరి 27 : మల్లన్న జాతరకు ఏర్పాట్లు చేశామని హమిదుల్లానగర్ గ్రామ సర్పంచ్ వట్టెల సతీశ్‌యాదవ్ తెలిపారు. మండలంలోని హమిదుల్లానగర్ గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. కొమరవెల్లి మల్లన్న జాతర సందర్భంగా నిర్వహించే జాతరలో భాగంగా ఆదివారం అగ్ని గుండాలు, స్వామివారి కల్యాణం, అమ్మవారి బోనాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. జాతరకు హమిదుల్లానగర్ గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని వివరించారు. మూడు రోజుల పాటు జాతరకు వచ్చిన భక్తులకు ఉన్నదానంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి రోజు స్వామి వారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే చర్యలు తప్పవు

హిమాయత్‌నగర్,జనవరి27: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారులు తమ తమ వ్యాపారాలను చేసుకోవాలని సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, నారాయణ గూడ ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. కింగ్‌కోఠిలో సెకండ్ హ్యాండ్ టూ వీలర్ అమ్మకాలు, కొనుగోళ్లు చేసే సంస్థల యజమానులతో శనివారం నారాయణగూడ ట్రాఫిక్ పీఎస్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టూ వీలర్ వాహనాలను అమ్మకాలు, కొనుగోళ్లు చేసే వాటిని దుకాణాల ముందు ఉన్న పుట్‌పాత్‌లపై నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని,రోడ్లపై వెళ్లే ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన పుట్‌పాత్‌లను వారు వినియోంచుకునేందుకు సహకారం అందించాలని పుట్‌పాత్,రోడ్డులను ఆక్రమించి వాహనాలను పార్కింగ్ చేసే వారిపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానుకోట టికెట్ ఆదివాసీలకే ఇవ్వండి

ఖైరతాబాద్, జనవరి 27 : 'స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఆదివాసీలను ఏ పార్టీలు, నేతలు పట్టించుకోలేదు...కనీసం ఆ తెగలు ఎక్కువగా ఉన్న మానుకోట (మహబూబాబాద్) పార్లమెంట్ టికెట్ అయినా ఇవ్వండి' అని మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జాతీయ అధ్యక్షుడు, అఖిల భారతీయ ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఆదివాసీ అఖిల పంక్ష సంఘాల జేఏసీ చైర్మన్ చందా లింగయ్య దొర డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదిలాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో ఆదివాసీల జనాభా అత్యధికంగా ఉందన్నారు. మూడు పర్యాయాలుగా తమకు టికెట్లు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. సమావేశంలో జాతీయ ఆదివాసీ అఖిల పక్ష సంఘాల జేఏసీ కోఆర్డినేటర్ పొడుగు శ్రీనాథ్, కన్వీనర్ వట్టం ఉపేందర్, సభ్యులు రమణాల లక్ష్మయ్య, వట్టం నారాయణ దొర, పాయం సత్యనారాయణ, డాక్టర్ చందా సంతోష్ కుమార్, వాసం రామకృష్ణ, పొదెం కృష్ణ ప్రసాద్, పొదెం రత్నం, కుంజ శ్రీను, ముక్తి రాజు, కొమురం బుచ్చయ్య, కొడెం వెంకటేశ్వర్లు, వట్టం కన్నయ్య, వజ్జ నరసింహా రావు, గొగ్గల ఆర్కే దొర, పులి శ్రీను, దబ్బ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చడమే లక్ష్యం

శంషాబాద్ రూరల్, జనవరి 27 : విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కమ్యూనిటీ కనెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ రోమీనా తెలిపారు. నాలుగు నెలల నుంచి ఐఎంటీ కళాశాల చుట్టూ పక్కల గ్రామాలైన శంకరాపూర్, చర్లగూడ, ఘాన్సిమియాగూడ తదితర గ్రామాలకు చెందిన 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఉచితంగా గణితం, కంప్యూటర్ బేసిక్ నైపుణ్యం పెంచడం కోసం ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశామని తెలిపారు. చివరి రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరైన శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతనం ఏసీపీ రాంచందర్‌రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా విద్యార్థులకు ఇలాంటి స్కిల్స్ అందించిన ఐఎంటీ కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. సమావేశంలో ఐఎంటీ కళాశాల డైరెక్టర్ చక్రపాణి, శంషాబాద్ రూరల్ సీఐ శ్రీనాథ్, కళాశాల అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తెలుగు టెలివిజన్ రచయితల సంఘం కార్యాలయం ప్రారంభం

జూబ్లీహిల్స్, జనవరి27: తెలుగు టెలివిజన్ రంగానికి చెందిన కార్మికులకు టీవీ నగర్‌తో పాటు టీవీ భవన్ ఉండాలని ఐఏఎస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి అభిలషించారు. యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో శ్రీనిలయం పేరుతో టీవీ ఫెడరేషన్, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన తెలుగు టెలివిజన్ రచయితల సంఘం కార్యాలయాన్ని శనివారం కమిషనర్ పార్థసారథి ప్రారంభించారు. కార్యక్రమంలో సినీ దర్శకులు రేలంగి నర్సింహారావు, విజన్ ఐఐకే ఇండియా సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, ఆదిత్య, రాజ్ కందుకూరి, రాకేశ్, శ్రీశైల మూర్తి, నరేందర్ రెడ్డి, చిత్తరంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

హిమాయత్‌నగర్,జనవరి27:కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పాలన చేస్తుందని సీపీఐ నగర కార్యదర్శి ఛాయదేవి ఆరోపించారు. శనివారం హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పదేండ్ల కాలంలో దేశాన్ని అభివృద్ధి చేయకుండా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు లను అమలు చేయకుండా కేంద్రం నిర్లక్ష్యం చేస్తుందని,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న పార్లమెంట్ ఎన్నికలో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.



హైకోర్టు ఆదేశాల మేరకు ఉద్యోగాలు ఇవ్వండి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో హోంగార్డులుగా విధులు నిర్వహించి వివిధ కారణాలతో తొలగించిన తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన హోంగార్డులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్దకు వచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని, అర్హత కలిగిన వారందరిని వెంటనే సర్వీసులోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

-బంజారాహిల్స్, జనవరి 27

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

వర్క్‌షాప్‌లో పాల్గొన్న కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27: విద్యార్థులు అవకాశాలను ఉపయోగించుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో సీఎస్ఈ, ఐటీ సంయుక్త విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్టార్టప్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సురేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించి తమ ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా కృత్రిమ మేధ, డీప్ లర్నింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్‌లు విద్యార్థుల మేధాశక్తిని పెంచడంతో పాటు వారిలోని విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాశ్రీ, సీడీఏసీ డైరెక్టర్ కుమార్, డాక్టర్ వి.వి.ప్రతిభాభారతి, సీఎస్ఎం హెచ్‌వోడీ స్వప్న, ఐటీ హెచ్‌వోడీ నందగోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ... దంపతులకు గాయాలు

బంజారాహిల్స్,జనవరి 27: అతివేగంతో వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో మరో బైక్‌మీద వెళ్తున్న భార్యాభర్తలతో పాటు పిల్లలకు గాయాలైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ప్రేమ్‌నగర్‌కు చెందిన గణేశ్ అనే వ్యక్తి పూజారిగా పనిచేస్తుంటారు. శుక్రవారం మెహదీపట్నం నుంచి పూజ ముగించుకుని భార్యతో పాటు ఇద్దరు పిల్లలను స్కూల్‌లో దింపేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన బైక్ వీరి బైక్‌ను ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనం సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

చంద్రకళకు చెక్కు అందజేస్తున్న కాదంబరి కిరణ్‌కుమార్

బంజారాహిల్స్,జనవరి 27: పేద సినీ కార్మికులకు, కళాకారులకు చేయూతనిస్తున్న మనం సైతం ఫౌండేషన్ నిర్వాహకులు కాదంబరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురికి శనివారం ఆర్థిక సాయం అందించారు. సినిమాల్లో నటిస్తూ ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్ వెళ్లనున్న సూరేపల్లి చంద్రకళకు మనం సైతం ఫౌండేషన్ తరపున రూ.25వేలు, సినీ కుటుంబానికి చెందిన ఎనుముల విదిష అనే బాలికకు ముక్కుకు సంబంధించిన సర్జరీ కోసం రూ.25వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ నటి రంగస్థలం లక్ష్మికి రూ.25వేల ఆర్థిక సాయాన్ని శనివారం కాదంబరి కిరణ్‌కుమార్ అందజేశారు. దాతల సహకారంతో నిరంతర మనం సైతం ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని కాదంబరి కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

నిమ్స్‌లో శిక్షణ పొందితే ఉన్నత అవకాశాలు

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసిన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, జనవరి 27 : దేశ విదేశాల్లో నిపుణుల కొరత చాలా ఉందని, నిమ్స్ వైద్య విద్యాశాలలో శిక్షణ పొందితే ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నత అవకాశాలు లభిస్తాయని డైరెక్టర్, విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్ వైద్య విద్యా డిగ్రీ అనుబంధ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ ప్రపంచ స్థాయి అత్యుత్తమ, నాణ్యమైన వైద్యానికి నిమ్స్ పెట్టింది పేరని, ఈ వైద్య కళాశాలలో సీటు రావడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కోర్సులకు, సాంకేతిక నిపుణులకు అత్యంత డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులను పీజీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అసోసియేట్ డీన్ డాక్టర్ సాయిసతీశ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, సాంకేతిక కోర్సులకు ప్రాక్టికల్స్ శిక్షణ చాలా ముఖ్యమన్నారు. నిమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి, మాజీ సీఎం ఓఎస్‌డీ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం టామ్‌కామ్ ద్వారా నర్సింగ్, పారామెడికల్ సాంకేతిక నిపుణులకు విదేశాల్లో అవకాశాలు కల్పిస్తున్నదని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిజాం వైద్య విద్యాశాల డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, భరత్ భూషణ్, శ్రీనివాస్, దామోదర నాయుడు పాల్గొన్నారు.

జీవన సత్యాలతో కొత్త శ్రీనివాస్ క్యాలెండర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకేంద్రుడు కె.రాఘవేంద్ర రావు

జూబ్లీహిల్స్, జనవరి 27: జీవితానుభవాలను కవిత్వాలుగా మలిచి, ఆ జీవన సత్యాలను అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో మంచి మాటల కొటేషన్లను ఏడాది పొడవునా చదువుకుని స్ఫూర్తి పొందేలా.. కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను దర్శకేంద్రుడు కె.రాఘవేంద్ర రావు శనివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ''జీవితమనే మహా భారతంలో కృష్ణుడు నీవే.. అర్జునుడు నీవే.. జీవన పోరాటంలో యోధుడివి నువ్వే.. సారథివి నువ్వే.. గెలిచి నిలవడానికి వ్యూహం నీదే.. ఆయుధం నీదే..'' అని రాసిన కొటేషన్ స్ఫూర్తిదాయకంగా ఉందని కొత్త శ్రీనివాస్ కొటేషన్లు ఎంతో ప్రేరణాత్మకంగా ఉంటాయని, వీటితో జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోగలుగుతామని రాఘవేంద్ర రావు అన్నారు. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందాలనే సంకల్పంతో ఈ క్యాలెండర్ రూపొందించినట్లు కొత్త శ్రీనివాస్ తెలిపారు.